# కాలమ్ దాటని కథలు

## కరెక్షన్

సత్యానికి తెల్లవారి ఐదు గంటలకే లేచి వెళ్ళి మిల్క్ బూత్ నుంచి పాలు తేవడం అలవాటు. తను స్పేర్‌గా కొనుక్కున్న ఖాళీ సీసాలు బూత్‌లో ఇచ్చేసి, నిండు సీసాలను తెచ్చుకుంటాడు. ఎప్పటిలాగే ఆరోజు కూడా రెండు నిండు సీసాలు తెచ్చాడు. అతను రాగానే భార్య ముందు ఒక సీసాలోని పాలు గిన్నెలో పోసి కాచి, కాఫీ కలిపి ఇచ్చింది.

ఆ తర్వాత రెండో సీసాలో పాలు గిన్నెలో పోస్తుంటే అందులోంచి ఏదో బొళుక్కుమని గిన్నెలో పడింది. ఏమిటా అని చెయ్యి గిన్నెలో పెట్టి దానిని పైకి తీసి, కెవ్వుమని అరిచింది సత్యం భార్య. వెంటనే దానిని క్రింద పడేసింది.

ఆ కేకకి నోట్లోని వేడి కాఫీని గుటుక్కున మింగి ఏమిటా అని సత్యం చూస్తే, ఒక చిన్న చచ్చిన ఎలుకపిల్ల. దానిని చూడగానే ఆపుకుందామన్నా ఆగకుండా భళుక్కున వాంతి వచ్చేయసాగింది సత్యానికి. నోటికి చేయి అడ్డం పెట్టుకుని దొడ్లోకి పరిగెత్తి వాంతి చేసుకువచ్చాడు.

వెంటనే ఆ పాలని సీసాలో మళ్ళీ పోసి, దానినీ, ఎలుకనీ తీసుకువెళ్ళి బూత్ వాళ్ళమీద విరుచుకుపడ్డాడు సత్యం. వాళ్ళు అందులో తమ తప్పేమీలేదని, కార్పొ-



రేషన్‌కి రిపోర్టు చేయమనీ సలహా ఇచ్చారు.

కార్పొరేషన్‌కి కంప్లైంటు ఇస్తూ, నలుగురికీ తెలియాలని దినపత్రికకి కూడా లేఖ వ్రాశాడు సత్యం. అతని లేఖ మూడోనాటికి పేపర్లో వచ్చింది.

మరో రెండు రోజులకి కార్పొరేషన్‌వారు సత్యం ఉత్తరానికి పత్రికాముఖంగా సమాధానం ఇస్తూ తమ ఆగ్రహం వ్యక్తం చేశారు అందులో.

—"శ్రీ సత్యం గారుమాకు వ్రాసిన కంప్లైంట్‌లో పాలసీసాలో ఒక ఎలుకపిల్ల వచ్చినట్టు వ్రాశారు. కాని, పత్రికాముఖాన ఎలుకలు అని వ్రాశారు. వచ్చినది ఒకే ఒక ఎలుక అయినప్పుడు బహువచనం వాడడం మా కార్పొరేషన్ ప్రతిష్ఠని దెబ్బ తీస్తోంది. వారి కంప్లైంట్ ప్రకారం, ఎలుకపిల్ల వచ్చియుండగా, పత్రికలో ఎలుకలు అని వ్రాయడంలో వారి ఆంతర్యం మాకు బోధపడడం లేదు. మా సీసాల్లో పెద్ద ఎలుకలు దూరడం అసాధ్యం. ఈ వివరణలను గమనించి, శ్రీ సత్యంగారి వంటివారు ఇక ముందైనా సత్యదూరమైన ఆరోపణలు చేయరని భావిస్తున్నాము"—అని వుంది.

కార్పొరేషన్‌వారు ఇచ్చిన వివరణకి కళ్ళు చెమర్చేటట్లు నవ్వుకున్నారు జనం.

—కె.ఆర్.కె.మోహన్

## టిక్కెట్టు కోసం

'చైతన్య' థియేటర్లో ఆంధ్రుల ఏకైక అందాల అభిమాన హీరో సినిమా హౌస్‌ఫుల్ కలెక్షన్లతో రికార్డు బద్దలు చేస్తోంది. తండోప తండాలుగా వస్తూ పోతున్న జన సమూహం నేల ఈనినట్లుంది. "ఐదు 'నలభై'... ఫైవ్ 'ఫార్టీ'" అంటూ వినిపిస్తోంది బ్లాక్ మార్కెటీర్ల దండకం. "ఏమిటీ! అయిదు రూపాయిల టిక్కెట్టు నలభై రూపాయిలా!" "ఇదో! చూడు బాబూ! నలభయి అయిదిస్తాను ఇటివ్వు" చూస్తూండగానే టికెట్ తన్నుకుపోయిన ఓ యాభయ్యయిదేళ్ళ భారీ ఆకారాన్ని గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాను. గేటు దాటి రోడ్డు మీది కొచ్చేసిన 'క్యూ'లో నా వెనుక వున్న పాతికమంది పెద్ద పులేదో తరుముకొస్తుందన్నట్టు అమాంతం వచ్చి మీదపడుతున్నారు. "బుకింగ్ తెరిచి అయిదు నిముషాలు కావస్తున్నా క్యూ కంట్రోల్ చేసే పోలీసోత్తములు ఇంతవరకు పత్తాలేకుండా ఎక్కడ చచ్చారో ఏవిటో" వెనుక నించి వెల్లువలా తోసుకొస్తున్న జన ప్రవాహం దాటికి తట్టుకోలేకసతమతమవుతూ నా వెనకమున్న లాల్చీవాలా విడిచిన నిట్టూర్పు. "ఈ మధ్య పోలీసుల అత్యాచారాలెక్కువయ్యాయి గదా, ఆడ 'పడుచుల్ని' వెదుక్కుంటున్నారేమో...హిహిహి..." ఇకిలించిందో హిప్పీ ఆకారం.

ధారాపాతంగా కారుతున్న చెమటల్ని తుడుచు కోటానికి కర్చీఫ్ కరువయ్యింది. ఆ తొడ తొక్కిడిలో ఎక్కడ పోయిందో ఏమో! బుకింగ్ దగ్గర్నుంచి నా వరకు ఉన్న జనాల్ని లెక్కిస్తూ క్లాసు కెపాసిటీతో అంచనా వేస్తున్నాను, టికెట్ దొరికేస్తే బావుండును అనుకుంటూ. "బుకింగ్ కౌంటర్ని సమీపించిన ఆ బ్లూషర్ట్ ఆసామీ నేనైతే"... ఆక్రోశించింది మనస్సు.


"అదుగో! థియేటరు కుర్రాడు వచ్చేశాడు. మనకీ పాట్లు ఇక ఉండవు" నా ముందున్న పెద్ద మనిషి తల వెనక్కి తిప్పి చూస్తూ ఆనందంగా అరిచాడు. నేను కూడా తలతిప్పి వెనక్కి దృష్టి సారించాను. ఖాకీ డ్రస్సులో వున్న కుర్రాడొకడు కర్రచేత పుచ్చుకొని జనాల్ని అదిలించి కంట్రోలు చేస్తూ ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్న శ్రీమన్నారాయణుడిలా అగుపించాడు. గుండెల నిండుగా ఊపిరి పీల్చుకున్నాను.

బుకింగ్ కౌంటర్ వరకు క్యూ కంట్రోల్ చేస్తూ వెళ్ళిన అతగాడు అక్కడ కొంచెం ఎక్కువ సమయం తీసుకున్నాడు. తిరిగి వస్తూ చేతి కర్ర అవతల పడేసి అయిదు రూపాయిల చిల్లర, ఒక టిక్కెట్టు ఫ్యాంటు పాకెట్లో కుక్కుకుంటూ తలవంచుకొని చిరునవ్వు చిందిస్తున్న ఆ కుర్రాణ్ణే బిత్తర పోయి చూస్తున్నాను. "హరి వీడిల్లు బంగారం గానూ... ఎంత ట్రిక్కు వేశాడయ్యా!" అన్న ఓ డెబ్బై ఏళ్ళ తాతగారి వ్యాఖ్య విన్న తరువాతగాని నాకు అసలు సంగతి అర్థం కాలేదు!

— పాట్నీడి చక్రరావు.

## మినీబస్సు

అది ఒక సెంటర్. జనం హడావిడిగా ఎవరి పనుల గురించి వాళ్ళు తిరుగుతున్నారు. అక్కడా అక్కడా నలుగు రైదుగురుచొప్పున గుమికూడి ఏవో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. ఇంతలో ఒకతను ఒలింపిక్ క్రీడాకారుడిలా పరుగెత్తుకుంటూ సరిగ్గా సెంటరులో కొచ్చి ఠక్కున సడన్‌బ్రేక్ వేసినట్టు ఆగి ఏక కాలంలో మెడ చుట్టూ తిప్పిచూచి, అంత వేగం తోనూ అక్కడే కిళ్ళీకొట్టు దగ్గర మాట్లాడుకుంటున్న మిత్రత్రయం దగ్గరకొచ్చి కంగారుగా "ఏవండీ ఇటుగా ఏదైనా నిమీసబబ్బు, ఛ ఛ..కాదు, మినీబస్సు వెళ్ళడం చూశారా, ఈ పట్నంలోంచే పిచ్చాసుపత్రి నుండి వస్తోందో మాటలు తడబడుతుండగా అడిగాడు. వాళ్ళొకసారి




కంగారుపడి తర్వాత నిదానించుకుని, "అవునూ! వెళ్ళిందయ్యా ఇప్పుడే.5, 6 నిమిషాలవు తుంది. చాలా స్పీడుగా వెళ్ళింది ఇటువైపు" అన్నారు ఒహవేళ పిచ్చివాడు కాదు కదా అన్న అనుమానంతో. వెంటనే ఒక్క గెంతు గెంతి, "ఓర్నాయనో నా కొంప మునిగింది" అంటూ పరిగెత్తబోయేవాడ్ని ఆ ముగ్గురు గట్టిగా పట్టుకుని "ఏంటయ్యా నీకూ, ఆ పిచ్చాళ్ళ బస్సుకు సంబంధం ఏమిటీ? మీ వాళ్ళెవరైనా వున్నారా?" అని అడిగారు."అదేం కాదు బాబోయ్, నా ఖర్మకాలి టీ తాగుదామని దిగాను. ఆ బస్సు డ్రైవర్‌ను నేనే" అని ఒక్క గెంతులో వాళ్ళని తప్పించుకుని పరిగెత్తసాగాడు.

—ఎం.ఆర్.ఎస్.శాస్త్రి.